# ఉద్రేకపూరితంగా వ్యవహరిస్తున్న హిందూమతతత్వశక్తులు

**కేంద్రంలోనూ,** మరికొన్ని రాష్ట్రాలలోనూ బిజెపి ప్రభుత్వాధికారాన్ని చెలాయిస్తుండటంతో, హిందూమతతత్వశక్తుల ఉద్రేకపూరిత ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండాపోతూ, వారి దాడులు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి. చట్టభీతి అనేదే లేకుండా వివిధ మతాల ప్రజలు సామరస్యంతో జీవించే మన దేశంలోని సామాజిక అల్లికను వారు ఛిన్నాభిన్నం చేస్తున్నారు. వారు లౌకిక శక్తుల గొంతులను నులిమివేస్తూ, తమ ప్రత్యర్థులపై కట్టుకథల తప్పుడు ఆరోపణలతో దూకుడుగా దాడులకు తెగబడుతున్నారు. మానవ సంబంధాలపట్ల, మానవత్వంపట్ల ఏలాంటి చింతా లేకుండా వారు తమ 'పవిత్ర యుద్ధాల్ని' సాగిస్తూ అవాంఛిత హింసను ప్రేరేపిస్తున్నారు.

ఇటీవల ఉద్రిక్తపూరితంగా వారు సాగించిన మరో దాడి గురించిన ఘటన వెలుగులో కొచ్చింది. 'విశ్వసనాతన సేన' అనబడే సంస్థకు చెందిన తీవ్ర హిందూమతతత్వశక్తులు 2018 అక్టోబర్ 5న పిచ్చెక్కిన తీరులో వ్యవహరించారు. ఈ విశ్వసనాతన సేనలో ప్రభుత్వాధికారంలో నున్న బిజెపికి చెందిన నాయకులు కూడా వున్నారు. అటవీ హక్కులకోసం పోరాడే క్రమంలో 1967 మార్చి 7న పోలీసుల కాల్పులలో మరణించిన మోహినీ త్రిపుర అనే మహిళయొక్క స్మారక చిహ్నానికి వేసిన పునాదిరాళ్ళను వీరు పెకిలించివేశారు. దక్షిణ త్రిపుర జిల్లాకు చెందిన మాతా గ్రామంలో వారు ఈ దుశ్చర్యకు ఒడిగట్టారు. మోహినీ త్రిపుర గిరిజనుల ప్రతిఘటనకు, అటవీ హక్కులకోసం సాగే ఉద్యమానికి ఓ చిహ్నంగా వుంది. ఆమె మరణించి 50 సం॥లు అవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని నాటి త్రిపుర ముఖ్యమంత్రి, సిపిఐ(ఎం) నాయకుడు మాణిక్ సర్కార్ ఆమె స్మారకచిహ్నం నిర్మాణానికి శంఖుస్థాపన చేశాడు.

మోహినీ త్రిపుర ధైర్యసాహసాలతో సాగించిన పోరాటం, చేసిన త్యాగాల ఫలితమే షెడ్యూల్డు జాతుల మరియు ఇతర సాంప్రదాయ అటవీవాసుల అటవీహక్కుల గుర్తింపు చట్టం- 2006 అని ప్రజలు భావిస్తారు. శంఖుస్థాపన చేసిన ఆ పరిసర ప్రాంతమంతటా ఆమె గౌరవ సూచకంగా అభివృద్ధి చేయతలపెట్టారు.

అయితే, మోహినీ త్రిపుర అమరత్వాన్ని కానీ, ప్రజల మనోభావాలనుకానీ హిందూ మతతత్వశక్తులు గుర్తించి, గౌరవించదలచలేదు. కనుకనే వారు ఆమె స్మారక చిహ్నపు పునాది రాళ్ళను కూల్చివేయటమేగాక, ఆ స్మారక స్థలంలోనే రాముని గుడి నిర్మించే పేరిట ఆ స్థలం మొత్తాన్ని ఆక్రమించదలిచారు.

పునాదిరాళ్ళను తొలగించి విధ్వంసం చేసిన 9 రోజుల తర్వాత అనగా అక్టోబర్ 14న విశ్వసనాతన సేన ఆ ప్రాంతంలో రాముని గుడి నిర్మాణానికి శంఖుస్థాపన చేసింది. త్రిపుర రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు సుబల్‌భౌమిక్ నాయకత్వం లోనే ఇదంతా జరిగింది. "రామమందిరం నిర్మాణంకోసం నేను పునాది రాయి వేశాను; రామ మందిరాన్ని నిర్మించకుండా మమ్మల్ని ఇక్కడ ఎవరూ నిరోధించలేరు" అని సుబల్ భౌమిక్ బరితెగించి మాట్లాడాడు. మరోవైపున బిజెపి, విశ్వసనాతన సేనతో తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదంటూ విడగొట్టుకొని ఉన్నట్లుగా చిత్రించే ప్రయత్నం చేస్తోంది. రాష్ట్రంలో జరిగిన ఎన్నికలలో వారి గెలుపుకు కీలకంగావున్న ఆదివాసుల మనోభావాలను సైతం వారు పరిగణలోకి తీసుకోదలుచుకోలేదు.

బెలోనియా పట్టణంలోని పోలీసు అధికారులకు ఈ దాడిపై సిపిఐ(ఎం) నాయకులు ఫిర్యాదు అందజేశారు. అయితే, విశ్వసనాతన సేన, బిజెపికి చెందినవారుగా భావిస్తున్న గూండాలు, సిపిఎం చేసిన ఫిర్యాదును చర్చకు రాకుండా బెలోనియాలోని సబ్‌డివిజనల్ మెజిస్ట్రేట్ కార్యాలయంలో నిరోధించారు. ప్రభుత్వ అధికారయంత్రాంగమంతా చేష్టలుడిగి ప్రేక్షక పాత్ర వహించారు మినహా ఫిర్యాదిదారులను కనీసం రక్షించే ప్రయత్నం కూడా చేయలేదు. ఇదీ, బ్రిటిష్ వలస పాలకుల చెప్పులలో కాళ్ళు దూర్చి దేశంలో పాలన సాగిస్తున్న, ప్రభుత్వాధికారం వెలగబెడుతున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యంయొక్క దయనీయ స్థితి! అధికారంలోనున్న పార్టీలు, పాలకులు శాంతిభద్రతలను పరిరక్షిస్తున్న పరిస్థితి ఇలా వుంది!

హిందూమతతత్వశక్తులు ఈవిధంగా దూకుడుగా నుండగా, బిజెపి అనుబంధంగానున్న విద్యార్థి విభాగమైన ఏబివిపి వినాశకర పాత్ర నిర్వహిస్తూ, అసమ్మతి గొంతుకలను ఏమాత్రం సహించలేకపోతోంది. తమతో విబేధించిన ఎవరినైనా సరే అవమానించే విధంగా చర్యలు చేపడుతోంది.

గాంధీవాద చరిత్రకారుడైన రామచంద్రగుహ ఇటీవలి కాలంలో ఏబివిపి బెదిరింపుల కారణంగా 2019లో అహమ్మదాబాద్ విశ్వ విద్యాలయంలో హాజరై చేయవలసిన ఉపన్యాసం చేయలేనని వెనక్కు తీసుకున్నాడు. ఆవిధంగా ఆయన కార్యక్రమం జరగకుండా ఏబివిపి అడ్డుకోగలిగింది.

ఇటీవల మరో సంఘటనలో రామన్‌మెగసెసే అవార్డు గ్రహీత, కర్నాటక సంగీత విద్వాంసుడైన టి.ఎం.కృష్ణను హిందూ మతతత్వశక్తులు ఘోరంగా అవమానించారు. టి.ఎం.కృష్ణ నరేంద్రమోడీపట్ల విమర్శనాత్మకంగా వుండటమే దీనికి కారణం. దిగజారుతున్న పర్యావరణ సమస్య, మతతత్వం, భావప్రకటనా స్వేచ్ఛ, విస్తృతమైన కుల సమస్య మొదలైన అంశాలను కర్నాటక సంగీత పరిధిలోకి తీసుకొని ప్రజలలో చైతన్యం కలిగించే విధంగా కృషిసాగిస్తానని ఆయన నొక్కి చెబుతున్నాడు. మాధ్యమాలలో

ఈ అంశాలపై అతను అద్భుతమైన వివరణలతో కూడిన వ్యాసాలు రాశాడు. సాంప్రదాయ సంగీత అవధులను దాటి అతను నిరసన వీడియోలలో ఇతరులందరితోనూ కలసి పాల్గొంటున్నాడు. అతను బహిరంగంగా మాట్లాడే దానిలోనూ, వ్రాతలోనూ ఛాందసవాదం నుండి పొంచివున్న ముప్పు గురించి దృష్టి సారించాడు. క్రిస్టియన్ పాటలకు గాత్రదానం చేసిన కొందరు కర్నాటక సంగీత కళాకారులకు మద్దతుగా టి.ఎం.కృష్ణ దృఢంగా నిలిచాడు. వారిని లక్ష్యంగా చేసుకోవటాన్ని ఖండిస్తూ, తాను కూడా అదేవిధంగా చేస్తానని, ఉన్మాదుల ఆదేశాలకు లోబడనని ధైర్యంగా ప్రకటించాడు.

హిందూమతతత్వశక్తులకు టి.ఎం. కృష్ణ యొక్క ఈ వ్యక్తిత్వం, స్వతంత్ర ధోరణి భరించరానిదిగా తయారైంది. వారు ఆయనను పలు రూపాల్లో మనదేశంలోనూ ఇంతకు ముందు అమెరికాలోనూ పథకం ప్రకారం వేధింపులు సాగించారు.

ఈసారి ఆ మతతత్వశక్తులు ప్రభుత్వరంగ సంస్థ అయిన 'ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా'పై వత్తిడితెచ్చి, తమకు లోబడేవిధంగా చేసుకొని ఢిల్లీలో జరగవలసిన టి.ఎం.కృష్ణ సంగీత కార్యక్రమాన్ని రద్దుచేయించారు. స్పిక్ మాకే కార్యక్రమంలో భాగంగా న్యూఢిల్లీలో నెహ్రూ పార్క్‌వద్ద 2018 నవంబర్ 17న జరగ వలసిన సంగీత కార్యక్రమాన్ని వీరు నిలిపి వేయించారు. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ఈ ప్రదర్శనను రద్దుచేసినట్లుగా ప్రకటించారు. "కొన్ని అత్యవసర కార్యక్రమాల వలన" అనే అత్యల్పమైన కారణం చూపి ఈ చర్య కొడిగట్టారు. సామాజిక మాధ్యమాలకు ఎయిర్ పోర్టు అథారిటీ తలొంచవలసి వచ్చిందనేది నిరాకరించలేము. టి.ఎం.కృష్ణను "జాతి వ్యతిరేకి"గా, "అర్బన్ నక్సలైట్"గా సామాజికమాధ్యమాలలో దూషణలకు పాల్పడ్డారు.

జరుగుతోన్న ఘటనలు వివిధ రూపాల్లో హిందూమతతత్వశక్తుల ఫాశిస్టు తరహా దాడుల ప్రమాద తీవ్రతను గురించి మనల్ని హెచ్చరిస్తున్నాయి. యావత్ సమాజానికి, సామాజిక పొందికకు ఈ చర్యలు పెను ప్రమాదంగా వున్నాయి. హిందూమతతత్వశక్తులు అన్ని రూపాల్లో సాగించే దూషణలు, విద్వేషాలు, దాడులన్నిటినీ మానవత్వపు ప్రాతిపదికనైనా సరే వ్యతిరేకించి, ఓడించేందుకు నిలకడకలిగిన, దృఢమైన ఉద్యమంయొక్క తక్షణావశ్యకత గురించి పై ఘటనలు మనలను తీవ్రంగా హెచ్చరిస్తున్నాయి.

oooo